తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

బుధవారం

27 మే 2026

సంపుటి 03

సంచిక 226

పేజీలు 8

వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


## చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు
- లంబాడీ హక్కుల పోరాట సమితి ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి
- ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపణ



➤ 2వ పేజిలో..




## పంచాయతీ సిబ్బందికి తొలి తేదీన జీతాలు

- ప్రతి నెలా సమయానికి వేతనాలపై సీఎం ఆదేశాలు
- గ్రామ పంచాయతీల ఆర్థిక స్వతంత్రతకు చర్యలు
- పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం

➤ 2వ పేజిలో..

## భగీరథ్‌కు మూడు రోజుల కస్టడీ

- పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు ఆదేశాలు
- వారం రోజుల కస్టడీ కోరిన పోలీసులకు పాక్షిక అనుమతి
- చర్లపల్లి జైలు నుంచి కస్టడీలోకి తీసుకోనున్న పోలీసులు



హైదరాబాద్, మే 26 కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం

➤ మిగతా 2వ పేజిలో..



## భూ బాధితులకు న్యాయం చేయాలి

- గవర్నర్‌కు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వినతి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన కవిత
- వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితుల సమస్యల వివరణ
- ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ ఉద్యమం హెచ్చరిక

హైదరాబాద్, మే 26 తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం లోక్ భవన్‌లో కలిసి భూ నిర్వాసితుల సమస్యలను వివరించారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌తో పాటు వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి ప్రాంతాల బాధితులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. భూసేకరణ, ఇండ్ల కూల్చివేత, రహదారి అలైన్‌మెంట్ మార్పుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ మార్పులు, రాయగిరి భూసేకరణ, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం జరుగుతున్న భూసేకరణ

➤ మిగతా 2వ పేజిలో..

## కశ్మీర్‌పై లష్కరే కొత్త కుట్ర

- పీఓకేలో భారీగా లాంచ్‌ప్యాడ్‌ల విస్తరణ
- వెయ్యి మంది ఉగ్రవాదులతో చొరబాటు యత్నాలు
- పాక్ రాజకీయ నేతలతో రహస్య భేటీలు



న్యూఢిల్లీ, మే 26 కశ్మీర్ అంశాన్ని మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో రెచ్చగొట్టి భారతదేశంలో అలజడి సృష్టించేందుకు ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా భారీ కుట్రలకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచడం, భారీ స్థాయిలో ఉగ్రవాదులను సిద్ధం చేయడం, అదే సమయంలో ప్రచార యుద్ధాన్ని ఉద్ధృతం చేయడం వంటి ద్విముఖ వ్యూహంతో లష్కరే ముందుకు సాగుతున్నట్లు సమాచారం. పాక్ రాజకీయ నాయకులతో లష్కరే అగ్రనేతల వరుస భేటీలు కూడా నిఘా సంస్థల దృష్టిలో పడ్డాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడేందుకు పీఓకే సరిహద్దుల్లో దాదాపు ఐదు వందల మందికి పైగా ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల భారత సైన్యం అప్రమత్తంగా వ్యవహ రించడంతో చొరబాటు ప్రయత్నాలు వరుసగా విఫలమయ్యాయి. దీంతో తీవ్ర అసహనా నికి గురైన లష్కరే నాయకత్వం లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను మరింత పెంచి ఉగ్రవాదుల సంఖ్యను వెయ్యికి చేర్చాలని నిర్ణయించినట్లు సమాచారం. పీఓకేలో జరిగిన కీలక సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. భారత భద్రతా దళాలపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా చొరబాటు యత్నాలను

➤ మిగతా 2వ పేజిలో..


## బాలికల విద్యకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

- పాఠశాలల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేయాలి
- శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలని సూచన
- చదువు మానేసే పరిస్థితులు రాకూడదన్న కోర్టు



న్యూఢిల్లీ, మే 26 దేశంలోని విద్యాసంస్థల్లో బాలికలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించాలంటూ సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బాలికల కోసం ప్రత్యేక టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో లేకపోవడం వల్ల చాలా మంది చదువు మధ్యలోనే

➤ మిగతా 2వ పేజిలో..



## మోదీ నాయకత్వంలో నూతన భారత్

- 2014తో ప్రారంభమైన మార్పుల ప్రయాణం
- యువతలో కొత్త ఆత్మవిశ్వాసం
- దేశ అభివృద్ధిపై రామ్ మోహన్ నాయుడు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 26 : 2014 మే 26 భారత రాజకీయాల్లో కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదని, దేశ మార్పుకు నాంది పలికిన చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరాపు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండు సంవత్సరాల్లో భారత్ ఎన్నడూ చూడని స్థాయిలో అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విప్లవం, బలమైన జాతీయ ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక నాయకత్వంతో దేశం కొత్త దిశగా పయనించిందని రామ్ మోహన్ నాయుడు పేర్కొన్నారు. "ఆత్మనిర్భర్ న్యూ ఇండియా" రూపుదిద్దుకోవడంలో ప్రధాని మోదీ పాత్ర కీలకమని కొనియాడారు. దేశ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన నాయకత్వం మోదీదేనని అభిప్రాయపడ్డారు. ఈ మార్పు యువత ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని ఆయన తెలిపారు. భారత యువత ఇప్పుడు పెద్ద కలలు కనడమే కాకుండా ప్రపంచ స్థాయిలో నాయకత్వం వహించగలమనే నమ్మకంతో ముందుకు సాగుతోందన్నారు. పరిమితులను కాకుండా అవకాశాలను చూసే తరం తయారైందని పేర్కొన్నారు.

దేశ నిర్మాణంపై ప్రధాని మోదీకి ఉన్న అంకితభావం, ప్రజలపై ఉన్న నమ్మకం దేశంలోని ప్రతి మూలకు ఆత్మవిశ్వాసాన్ని తీసుకెళ్లిందన్నారు. దూర ప్రాంతాలు

➤ మిగతా 2వ పేజిలో..

## ఆర్టీసీ డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ రద్దు చేయాలి

- ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేసిన గంగుల కమలాకర్
- వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్
- బీఆర్ఎస్ మద్దతు



➤ 2వ పేజిలో..

## అమెరికాలో భారతీయ మహిళ హత్య

- సూపర్‌మార్కెట్‌లో కాల్పుల కలకలం
- సీసీటీవీలో రికార్డైన దారుణం
- నిందితుడి కోసం గాలింపు



వర్జీనియా, మే 26 అమెరికాలో మరో భారతీయ సంతతి మహిళ దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. వర్జీనియాలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్న గుజరాత్‌కు చెందిన మహిళపై దుండగుడు కాల్పులు జరిపి హతమార్చాడు. దోపిడీ యత్నంలో ఈ ఘాతుకం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన అమెరికాలోని భారతీయ సమాజంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతురాలిని నలభై ఐదు సంవత్సరాల మేఘనాబెన్ పటేల్‌గా గుర్తించారు. ఆమె గుజరాత్ రాష్ట్రంలోని మెహసానా జిల్లా విసాపూర్ తాలూకా జంత్రాల్ గ్రామానికి చెందినవారు. గత పదేళ్లుగా వర్జీనియాలోని సూపర్‌మార్కెట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు ప్రస్తుతం గుజరాత్‌లోనే నివసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన మొత్తం స్టోర్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. వీడియో దృశ్యాల ప్రకారం జంతువుల చర్మం ముద్రలతో ఉన్న ప్యాంటు, గ్రే జాకెట్ ధరించిన ఓ వ్యక్తి ముఖానికి ముసుగు కట్టుకుని స్టోర్‌లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో స్టోర్‌లో ఎవరూ లేకపోవడంతో నేరుగా కౌంటర్ వద్దకు వెళ్లి

➤ మిగతా 2వ పేజిలో..

# చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి




హైదరాబాద్, మే 26 చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన లంబాడీ హక్కుల పోరాట సమితి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని హరీష్ రావు అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 50 వేల ఎకరాల భూములను పరిశ్రమల పేరుతో లాక్కుంటున్నారని మండిపడ్డారు. భూములను కాపాడుకోవాలని అడిగిన లంబాడీ యువతకు బేడీలు వేసి జైళ్లకు పంపించడం దారుణమన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు లంబాడీలు అనేక పోరాటాలు చేశారని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3,146 తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి స్వయం పాలన కల్పించిందని గుర్తుచేశారు. సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించిన ఘనత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రకటించిన డిక్లరేషన్‌లో ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. ఉద్యోగాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు, ఐటీడీఏలు, కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు వంటి అంశాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కొడంగల్ ప్రాంతంలోని లంబాడీ ప్రజలు రేవంత్ రెడ్డికి రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. భూముల కోసం పోరాడుతున్న గిరిజనులపై కేసులు పెట్టడం, మహిళలు, గర్భిణీలపై కూడా పోలీసులు దాడులు చేయించడం దారుణమన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ సహించదని స్పష్టం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. లేకపోతే ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. లంబాడీలు మంచివారే కానీ మోసం చేస్తే ఎంతకైనా తెగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పోరాటాన్ని ప్రతి తండాకు విస్తరించాలని నేతలు పిలుపునిచ్చారు.

# భగీరథ్‌కు మూడు రోజుల కస్టడీ

➢ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు వెలువరించింది. భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతించింది. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని కోర్టును కోరారు. విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కూడా విజ్ఞప్తి చేశారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు ఉపయోగించకుండా పోలీసులను ఆదేశించాలని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. న్యాయపరమైన హక్కులను కాపాడాలని కోరుతూ పలు షరతులు విధించాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఈ అంశాలపై కూడా సూచనలు చేసినట్లు సమాచారం.

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసులో మరిన్ని కఠిన సెక్షన్లు జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే తన కుమారుడు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయాడని బండి సంజయ్ పేర్కొన్నారు. నేరాన్ని అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కోర్టు భగీరథ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## కశ్మీర్‌పై లష్కరే కొత్త కుట్ర

➢ మొదటి పేజీ తరువాయి

మరింత పెంచాలని లష్కరే వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడిలో ఇరవై ఆరు మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు లష్కరే అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కారణమని ఇప్పటికే భద్రతా సంస్థలు నిర్ధారించాయి. అనంతరం భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో మురిద్కేలోని లష్కరే ప్రధాన శిక్షణా కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. ఆ దెబ్బ నుంచి కోలుకునేందుకే ఇప్పుడు సంస్థ మళ్లీ కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు అత్యంత సన్నిహితుడైన రాణా సనావుల్లాతో రహస్య సమావేశం నిర్వహించడం సంచలనం సృష్టించింది. ఈ భేటీలో లష్కరే కొత్త ప్రణాళికలు, నాయకత్వ మార్పులపై చర్చ జరిగినట్లు సమాచారం. హాఫీజ్ సయీద్‌ను సిద్ధాంతకర్తగా కొనసాగిస్తూ యువకుడైన తల్హా సయీద్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇక పీఓకే మాజీ ప్రధాని సర్దార్ అతీక్ అహ్మద్ ఖాన్‌తో కూడా తల్హా సయీద్ సమావేశమైనట్లు తెలుస్తోంది. లాంచ్‌ప్యాడ్‌ల విస్తరణకు అవసరమైన మౌలిక వసతులు, రహస్య మద్దతు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం పీఓకేలో అభివృద్ధి లేకపోవడంపై స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో, ఆ వ్యతిరేకతను మళ్లించేందుకు కశ్మీర్ సెంటిమెంట్‌ను మళ్లీ రెచ్చగొట్టాలని లష్కరే భావిస్తున్నట్లు నిఘా అధికారులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల దృష్టిని అభివృద్ధి సమస్యల నుంచి మళ్లించడమే అసలు లక్ష్యమని వారు పేర్కొంటున్నారు.

# పంచాయతీ సిబ్బందికి తొలి తేదీన జీతాలు



హైదరాబాద్, మే 26 : రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తేదీననే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి వేతనాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికీ జీతాలు అందాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల కోసం ప్రభుత్వం ప్రతి నెలా ప్రత్యేకంగా రూ.50 కోట్లు విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు అనే తేడా లేకుండా అన్ని శాఖల ఉద్యోగులకు మొదటి తేదీననే వేతనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా సహించబోమని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల స్వంత ఆదాయంపై గత ప్రభుత్వం తీసుకొచ్చిన పరిమితులను తొలగిస్తూ ఆర్థిక స్వతంత్రత పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 70(3)లో సవరణలు చేసి గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాల్లో కాకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం తీసుకురావాలని సూచించారు. పెన్షన్ల పంపిణీ విధానంలో కూడా మార్పులు తీసుకురావాలని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులకు ఆదేశించారు. అర్హులైన వారికి మాత్రమే పెన్షన్లు అందేలా ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు, సర్వే డేటా ఆధారంగా క్రమబద్ధీకరణ చేపట్టాలని సూచించారు. కొత్త పెన్షన్ల మంజూరులో అర్హులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, సమర్థత పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల బలోపేతమే గ్రామీణాభివృద్ధికి ప్రధాన ఆధారం అని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో వెల్లడించారు.

## భూ బాధితులకు న్యాయం చేయాలి

➢ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు కవిత తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల ఇళ్లు కూల్చి వారిని మానసికంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు వంద రూపాయల చీరలు ఇచ్చి కోటీశ్వరులను చేశామంటూ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతల సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కవిత పేర్కొన్నారు. ఒక మహిళకు గర్భస్రావం జరిగిన ఘటన ఇప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆవేదనలో ఉన్నారని తెలిపారు. వెంటనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ నాలుగు సార్లు మార్చిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కవిత తెలిపారు. ఈ అంశంపై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని చెప్పారు. కేంద్ర మంత్రికి సంబంధించిన లేఖలను కూడా గవర్నర్‌కు చూపించినట్లు వివరించారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని, అప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమ బాట పడతామని కవిత స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న అన్ని మార్గాల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. భూ నిర్వాసితుల సమస్యలపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

## మోదీ నాయకత్వంలో నూతన భారత్

➢ మొదటి పేజీ తరువాయి

కూడా ఇప్పుడు దేశ అభివృద్ధి కథలో భాగమవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి ప్రయోజనాలు చివరి వ్యక్తి వరకు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గతంలో విధానాల స్తబ్దతతో ఉన్న భారత్ ఇప్పుడు సంస్కరణలు, పనితీరు, మార్పు అనే సిద్ధాంతాలతో ముందుకు సాగుతోందని రామ్ మోహన్ నాయుడు అన్నారు. "రీఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్" మంత్రంతో దేశం భవిష్యత్‌కు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. పారదర్శకత, వేగం, సేవాభావంతో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని ఆయన తెలిపారు. ఆత్మవిశ్వాసం, స్వావలంబన, సేవాభావం, ఆశయాలతో ముందుకు సాగుతున్న నూతన భారతాన్ని చూస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ రద్దు చేయాలి

అజగిత్యాల, మే 26 జగిత్యాలలో సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటు వేయడం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఉద్యోగులు తమ సమస్యలను చెప్పుకునే హక్కు ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కఠిన చర్యలకు దిగడం దురదృష్టకరమన్నారు. అశోక్‌పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల మనోభావాలను గౌరవించాలని సూచించారు. ఈ వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డ్రైవర్ అశోక్‌కు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఉద్యోగులపై ప్రతీకార చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.

## అమెరికాలో భారతీయ మహిళ హత్య

➢ మొదటి పేజీ తరువాయి

మేఘనాబెన్‌తో మాట్లాడాడు. కొద్ది క్షణాల తర్వాత అతడు అకస్మాత్తుగా జేబులో నుంచి తుపాకీ తీసి మేఘనాబెన్‌పై కాల్పులు జరిపాడు. కాల్పులతో ఆమె కిందపడిపోవడంతో కూడా నిందితుడు ఆగలేదు. కౌంటర్ పైనుంచి దూకి ఆమెపైకి వంగి మరికొన్ని రౌండ్లు కాల్పులు జరిపినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించింది. అనంతరం అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దోపిడీ యత్నం విఫలమవడంతోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మేఘనాబెన్‌కు భర్త ఉపేంద్రభాయ్ పటేల్, కుమార్తె నక్షీబెన్, కుమారుడు స్మిత్ ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అమెరికాలో భారతీయుల భద్రతపై మళ్లీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# బాలికల విద్యకు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిని వెంటనే మార్చాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు సూచనలు చేసింది. జస్టిస్ బీ పర్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ జరిపింది. దేశంలోని అనేక విద్యాసంస్థల్లో ఇప్పటికీ బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు లేవని కోర్టు వ్యాఖ్యానించింది. గత జనవరి 30న ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. విద్యార్థినులకు అవసరమైన ఆరోగ్య, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విద్యాసంస్థల్లో శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా బయోడీగ్రేడబుల్ న్యాప్‌కిన్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోర్టు పేర్కొంది. వాటిని సరైన విధంగా వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించింది. ఈ చర్యల వల్ల దేశంలోని బాలికలు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

ప్రాథమిక సదుపాయాల కొరత కారణంగా చాలా మంది ఆడపిల్లలు చదువు మానేసి ఇంటి పనులకు పరిమితమవుతున్నారని సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. బాలికల విద్యకు ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. ప్రతి బాలిక విద్యను కొనసాగించేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివరాలు సేకరించారా అని కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి రెండు నెలల క్రితమే ప్రాథమిక డాటా సేకరించినట్లు కేంద్రం కోర్టుకు తెలిపింది. రాష్ట్రాల నుంచి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తూ చర్యలు కొనసాగించాలని ధర్మాసనం సూచించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ అంశంపై నివేదికలు సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రభుత్వాలు ఈ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేసి వాటి ప్రయోజనాలు ప్రతి బాలికకు అందేలా చూడాలని స్పష్టం చేసింది. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీ పడకూడదని కోర్టు పేర్కొంది.

THARANGALU DAILY NEWS
బుధవారం, 27 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మౌలిక వసతులు కల్పించండి - సిపిఎం



**ఇల్లందు ప్రతినిధి మే 26, ( తరంగాలు):**
గత 8 సంవత్సరంలో నుండి సి. ఎస్. పి గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి యాకయ్య నగర్ నందు నిరుపేద ప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న అక్కడి ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని, తాగడానికి నీళ్లు లేక తల్లాడిళ్లుతున్నారని తక్షణమే మంచి నీళ్లు ఇప్పించాలని భద్రాద్ది కొత్తగూడెం జిల్లా ఆర్డీవో రామ్ మోహన్ కు, ఇల్లందు తహసీల్దార్ సూర్యనారాయణ కి సిపిఎం మండల పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నందు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి రెవిన్యూ సిబ్బందికి ఎంక్వయిరీ నిర్వహించి ముందుగా మంచినీరు సౌకర్యం అలాగే మౌలిక సదుపాయాలు కల్పించుతామణి హామీ ఇవ్వడం జరిగిందని పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్బంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన గుడిసె వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ, అనేక సంవత్సరాలు గుడిసె వాసుల సమస్యలు కోసం సిపిఎం పార్టీ పోరాడుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించడం హర్షానియ మని, అదేవిధంగా అక్కడి నిరుపేదలకు సర్వే నిర్వహించి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడ అందేలా చెయ్యాలని అధికార్ల ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, వెంకన్న, సుజాత, కోటమ్మ, గోబిరియా,హుస్సేన్, మంగ, వైకుంఠం, రహీమ్ పాషా, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీ విద్యార్థులతో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే.26, తరంగాలు:**
మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాలేజీ విద్యార్థులతో 'పోక్సో చట్టం - అవగాహన' అనే అంశంపై వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాలల పట్ల లైంగిక నేరాలను అరికట్టడానికి, చట్టాలపై యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించారు .ఈ సదస్సులో పోక్సో కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నుండి సంరక్షించే చట్టం పోక్సో లోని కఠిన నిబంధనలను ఆయన వివరించారు.న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే ఎదురయ్యే శిక్షలతో పాటు, బాధితులకు చట్టం కల్పించే రక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.భరోసా సబ్ ఇన్స్పెక్టర్ దీపిక రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, తెలియని వారి తో సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత సంభాషణలు, ఫోటోలు షేరింగ్ లు దుర్వినియోగం అవుతునట్లు గమనించాలన్నారు. షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ సునంద మాట్లాడుతూ చదువుకునే వయస్సులో ప్రేమ అనే వ్యామోహం లో భవిష్యతు ను అంధకారంలో పడేస్తున్నారన్నారు. ఏదైనా ఆపద కలిగితే, వేధింపులకు గురైతే ధైర్యంగా వెంటనే న్యాయ సహాయం కోసం అధికారులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడుతాయన్నారు. ఈ సదస్సులో సీనియర్ న్యాయవాది చెన్న మల్లా రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ, సఖి అడ్మిన్ శ్రావణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో గుడుంబా నల్ల బెల్లం పట్టికపై ఆకస్మిక తనిఖీలు



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే.26,తరంగాలు:**
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ. అంజలి, ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున "కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం" నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు సుమారు 120 ఇండ్లు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించారు.అక్రమంగా నిల్వ ఉంచిన100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా,20 కిలోల పట్టిక,16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ. అంజలి, తెలిపారు.తనిఖీల అనంతరం గ్రామస్తులను సమీకరించి దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈతకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్, ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా శక్తి భవనాలను
# సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి
- రూ.10 లక్షలతో మహిళా శక్తి భవన నిర్మాణం



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మే.26, తరంగాలు:**
కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో మహిళా శక్తి భవనాన్ని స్థానిక ఎంపీఓ హరిష్,సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి ప్రారంభించారు. భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామంలో మహిళా శక్తి కార్యాలయం ను స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళా శక్తి భవనాలను ఉపయోగించుకోవాలని వారు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి భవనానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసిందని వారు తెలిపారు. అంతేకాకుండా మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందని సెర్ప్ మహిళా శక్తి భవనాలు మంజూరు చేసి వారి యొక్క సమస్యలు పరిష్కరించుకోవడంలో కార్యాలయాలు సద్వినియోగపరచుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి , ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, వార్డు సభ్యులు బోనగిరి జ్యోతి బండారు ప్రియాంక, సుధ గాని మమత, కుండే బాల కుమార్, మంద ప్రవీణ్,వి. వో.ఎ శాగంటి శ్రీనివాస్,గ్రామైక్య సంఘాల అధ్యక్షులు బండారు పద్మ,అరిగే శాంతమ్మ, నాయకులు సంకు శ్రీనివాస్ రెడ్డి,నూకల వెంకటేశ్వర్లు బండారు గోపి,సత్యనారాయణ బండారు బుచ్చి రాములు,స్వయం సహాయక సంఘాల మహిళలు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# తెచ్చింది గోరంత తరలించింది కొండంత

- మట్టి మాఫియాకు కీలక బాధ్యతలు వహించిన ప్రజా ప్రతినిధి
- అక్రమార్కులకు భజనగా మారిన పలు శాఖల అధికారులు

**ఇల్లందు ప్రతినిధి మే 26,( తరంగాలు):**
అక్రమ మట్టి దందాకు కేరాఫ్ అడ్రస్ గా మారిన నాయకులగూడెం చెరువు, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రజా ప్రతినిధి ఆ చెరువులోని మట్టి దందాను శాసించడం ఆనవాయితీగా వస్తుందని ఆదివాసి సంఘాలు తెలిపారు. ఈ మట్టి దందాతో లక్షలు కూడగడుతున్నారని, అక్రమార్కులు మాత్రం ఏకంగా కోట్లలో మట్టి తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు గూడెం చెరువు అంటేనే వ్యవసాయానికి పెద్ద దిక్కు, ఆ చెరువును నమ్ముకుని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యవసాయం, అసెంగ్గి పంటకు మూల ఆధారంగా ఉందని అన్నారు. ఎండాకాలంలో చుట్టుపక్కల గ్రామాల మూగజీవాల నీటి ఎద్దడిని తీర్చేందుకు ఆ చెరువు అనువుగా ఉంటుందని అన్నారు. కానీ ఆ చెరువులోని మట్టిని తరలించేందుకు మట్టి మాఫియా ముఠా ఓ ప్రజా ప్రతినిదిని, అధికారులను కూడగట్టుకుని మట్టి దందాకు తెరలేపారు. ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఓ ఆదివాసి పేరిట అనుమతి తెచ్చామని చెబుతూ అందులోని షరతులను, ఆదివాసి చట్టాలను ఉల్లంఘించి, బినామీ గా ఉంటున్న వ్యక్తి వ్యాపారానికి మట్టి తోలకాలను వీలుగా మలుచుకుని ఇటుక బట్టీలకు, పెంకు పరిశ్రమలకు విచ్చలవిడిగా రాత్రింబవళ్లు తేడా లేకుండా భారీ ప్రోక్లేన్ ద్వారా 6 ఫీట్ల నుండి 8 పీట్ల లోతు తోడేస్తూ , టర్బో లారీలతో దగ్గరుండి టెంటు వేసుకొని మరి మట్టిని తరలించేందుకు ప్రజా ప్రతినిధి ఒప్పందాలు కుదుర్చుకోవడం గమనార్హం. 2000 క్యూబిక్ మట్టి తరలింపు అంటూ, 8000 నుండి 10.000 క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించడం జరిగిందని స్థానికులు తెలిపారు.ఈ మట్టి తోలకాలు నిర్వహించే సందర్భంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వెనుక అంతర్యం ఏమిటి అంటూ స్థానిక ప్రజలు ప్రశ్నించారు. నాయకులగూడెం చెరువు మట్టిని తరలించేందుకు పంచాయతీ కార్యాలయ మొదలు పలు శాఖ అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్టు సర్వత్ర విమర్శలు అనేకం. సతులు సర్పంచులు అయితే పతులు పెత్తనాలు చేస్తు అందిన కాడికి దోచేస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ మట్టి దందాపై జిల్లా అధికారులకు ఆదివాసి సంఘాల నాయకులు కంప్లైంట్ చేసినట్టు తెలిపారు.






# మహిళల ఆర్థిక సాధకారతే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వైస్ చైర్ పర్సన్ అల్లం రమ

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 26, తరంగాలు:**
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణలో భాగంగా నేడు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయంలో పట్టణ పేదరిక సంస్థ- మెప్మా ఆధ్వర్యంలో ఓంకారేశ్వర పట్టణ సమైక్య సర్వసభ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ ముఖ్యఅతిథులుగా హాజరై కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెప్మా విభాగానికి సంబంధించిన ఏ సమస్య వచ్చిన వాటి పరిష్కారానికి పురపాలక సంస్థ ముందుంటుందని తెలిపారు.మహిళల ఆర్థిక సాధకారతే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలలు ఉపాధి సాధించి కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలాపేతం చేయడానికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, సబ్సిడీలు, అందిస్తూ వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ అమలు చేస్తున్న మహిళ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి శ్రీనివాసరావు , డిఎంసి విజయ, అధ్యక్షురాలు అనిత , కార్యదర్శి పూలమ్మ , కోశాధికారి శ్యామల, మున్సిపాలిటీ ఆర్పీలు, సమైక్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
బుధవారం, 27 మే, 2026


# బాల్య వివాహాలను నిర్మూలించాలి: జిల్లా కలెక్టర్ సత్య శారద



**పర్వతగిరి, తరంగాలు(మే 26):**
తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ,"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మహిళా వారోత్సవాలలో భాగంగా "బాల్య వివాహ రహిత తెలంగాణ" కార్యక్రమంను పర్వతగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ... బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి,కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. పర్వతగిరి మండలంతో పాటు మొత్తం వరంగల్ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని, గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాలను అరికట్టేందుకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమ, పర్వతగిరి ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎమ్మార్వో వెంకటస్వామి, సీడీపీఓ దెబోరా, షేర్ ఎన్జీఓ కోఆర్డినేటర్ శిరీష, వైద్యాధికారి డా. ఉదయ్ కుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జఫర్గడ్ ప్రతినిధి, మే 26, (తరంగాలు):**
మంగళవారం, జిల్లాలోని లో ఉన్న (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రం, జఫర్గడ్ మండలంలోని కూనూరు గ్రామంలో గల పీఏసీఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎన్ని టోకెన్లు జారీ చేశారు? ఇప్పటివరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యం తరలించాయి? ఏ సమయంలో ఏ మిల్లుకు పంపించారు? ట్రక్ షీట్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేశారా? అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే ఇప్పటివరకు ఎన్ని ఓపీఎంఎస్ ఎంట్రీలు పూర్తి చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోకెన్ పొందిన రైతుల సంఖ్య, ప్రతి టోకెన్‌కు అనుగుణంగా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు.ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలుదేరాయో, ఇప్పటివరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో, ట్రక్ షీట్‌లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ప్రస్తుతం ఎన్ని కళ్లాల్లో ధాన్యం నిల్వలో ఉందో, ఎన్ని వాహనాల ఎంట్రీలు నమోదయ్యాయో కూడా నిరంతరం నవీకరణ చేయాలని ఆదేశించారు. ధాన్యం తేమ శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వాహనాలు వెళ్లాయో, ట్రక్ షీట్‌లో నమోదైన వివరాలను పరిశీలించారు. ధాన్యం నిల్వలు, గన్నీ సంచుల లభ్యత, కాంటా పూర్తయిన తర్వాత మిగిలి ఉన్న ధాన్యం బస్తాల వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలపై ఆరా తీశారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది హమాలీలు పనిచేస్తున్నారో తెలుసుకుని అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేసి వెంటనే లోడింగ్, అన్లోడింగ్ పనులు చేపట్టాలని సూచించారు. .కాంటా వద్ద 41 కిలోల ప్రకారం తూకం వేయాలని సూచించారు.ధాన్యం నిల్వ కాకుండా కేంద్రాల నిర్వహణ సమర్థంగా ఉండాలని సూచించారు.పీఏసీఎస్ కూనూరు కేంద్రంలో డీసీఎంల ద్వారా ధాన్యం తరలింపు పరిస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో రెండు లారీలను తక్షణమే ఈ కేంద్రానికి పంపించాలని ఆర్టీఓకు సూచించారు. ఈ నేపథ్యంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్ , తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతమైన చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### కేసముద్రంలో గంజాయి స్థావరాలపై పోలీసుల నిఘా

# నార్కోటిక్ డాగ్‌తో ముమ్మర తనిఖీలు

- **యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలపై ఉక్కుపాదం: మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్**
- **గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు: కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ హెచ్చరిక**

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే.26, తరంగాలు:**
మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక కూంబింగ్ తనిఖీలు చేపట్టారు. కేసముద్రం ఎస్సై కె. క్రాంతి కిరణ్, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ మ్యాక్స్, డాగ్ హ్యాండ్లర్ శివరాజ్ పోలీస్ సిబ్బంది కలిసి గ్రామ శివారు ప్రాంతాలు, చెట్ల పొదలు, నిర్మానుష్య ప్రదేశాలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, యువత గుమికూడే ప్రాంతాలు గంజాయి సేవిస్తున్నట్లు అనుమానిత ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ..గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయి. క్షణిక ఆనందం కోసం భవిష్యత్తును పాడు చేసుకోవద్దు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలి. యువత చదువు, ఉద్యోగం, క్రీడలు మరియు మంచి లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు.ఎస్సై క్రాంతి కిరణ్, మాట్లాడుతూ కేసముద్రం పరిధిలో మత్తు పదార్థాలపై





ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, గంజాయి సేవిస్తూ లేదా విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి కుటుంబ సభ్యుల ఆశలను నిలబెట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డాగ్ మ్యాక్స్, డాగ్ హ్యాండ్లర్ శివరాజ్, కేసముద్రం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందుతులు అరెస్టు

- **టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మంగళవారం టేకులపల్లి వంతెన వద్ద ఎస్సై వి. రమేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా గత కొంతకాలం నుండి ఖమ్మంలో రెండు మోటార్ సైకిల్, రెండు ఆటోలు దొంగిలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా 3,30,000 ఉంటుందని తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్ లో సిపిఐ ఆఫీస్ వద్ద ఒక మోటార్ సైకిల్ ను రెండవది ఖమ్మం బాలాజీ నగర్ లో లిటిల్ స్టార్ హాస్పిటల్ వద్ద ఒక ఆటోను, మూడోది ఖమ్మం బ్రాహ్మణ బజార్లో ఒక ఇంటి ముందు ఉన్న పల్సర్ మోటార్ సైకిల్ ను, ఖమ్మం నెహ్రూ నగర్ లో ఎం ఎన్ ఆర్ హాస్పిటల్ ముందు ఆగి ఉన్న ఒక ఆటోను దొంగిలించినావని నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. నిందితులు ఖమ్మం పెద్ద తండాకు చెందిన ఆటో డ్రైవర్లైన నునావత్ సాయికుమార్, బానోత్ సాయికుమార్, వియం బంజరకు చెందిన రేపల్లి శ్రీను రాజు ఇతని పై గతంలో కూడా ఖమ్మం ఒకటవ టౌన్ పరిధిలో రెండు దొంగతనాలు చేశాడని తెలిసిందన్నారు. రెండు ఆటోలు, రెండు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకొని వారిని అరెస్టు చేసి కోర్టు నందు హాజరు పరిచినట్లు తెలిపారు.

# ఒడిషాలో విషాదకర ఘటన

- **సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు కూలీల మృతి**
- **నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు**

భువనేశ్వర్,మే 26 ఒడిశాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఊపిరాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కళహండి జిల్లాలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో సెంట్రింగ్ తీయడానికి మేస్త్రి దిగాడు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి సెంట్రింగ్ తీస్తున్న సమయంలో అది కూలిపోయింది. దీంతో మేస్త్రి అందులో చిక్కుకుపోయాడు. మేస్త్రిని కాపాడేందుకు మరో ఐదుగురు సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగారు. లోపలికి దిగిన ఆ ఐదుగురు కూడా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు వెంటనే స్పందించి మొత్తం ఆరుగురిని వెలికి తీశారు. హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తరలించే సమయానికే వారు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మేస్త్రిలు, ఒక కార్మికుడు, ఇంటి యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

# నియోజకవర్గ పరిధిలో ఫారెస్ట్, అసైన్డ్ రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- **అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పరంగా కచ్చితంగా న్యాయం జరుగుతుంది**
- **మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్**

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 26, తరంగాలు:**
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ, అసైన్డ్ వ్యవసాయ భూముల పరిష్కార సమన్వయ సమావేశం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్,లఅధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్ , తహసిల్దార్లు, ఏడి సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ అసైన్డ్ భూ సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పరిష్కరించాలని తద్వారా పేద ప్రజల మనసుల్లో అధికారులు ఉంటారని తెలిపారు,అందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు, జెన్ సిపాయి భూములు మొదటి వార్ లో తరతరాల నుండి వారికి వచ్చాయని , అట్టి మండలాలు నెల్లికుదురు, నరసింహ గూడెం సుమారు 250 ఎకరాలు ఉంటాయన్నారు,అలాగే సీతానగారం, గుండెంగా, ముడుపుగల్, నారాయణపురం, నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి చిన్న చిన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టులో ఉన్న భూ సమస్యల కోసం కలెక్టర్ గారు హైదరాబాద్ స్థాయి, భూ పరిపాలన కమిషనర్ గారిచే చర్చించి ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన నిరుపేద వారికి అందించాలని ఆయన కోరారు,గతంలో రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని నిజమైన లబ్ధిదారులు ప్రస్తుతం ఉన్నారని వారిని మాత్రమే



గుర్తించాలని, పేద ప్రజలకు సహాయం చేస్తే ఉద్యోగ తృప్తి లభిస్తుంది అని ఎమ్మెల్యే తెలిపారు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు,పని ఒత్తిడి ఉన్న గాని ప్రత్యేకంగా ఈ భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి,రెవెన్యూ, సర్వే సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 27 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మహిళల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యం

- మహిళా భద్రతపై అవగాహన
- గోడ పత్రికను ఆవిష్కరించిన సీపీ సన్ ప్రీత్ సింగ్
- సీపీ కార్యాలయంలో కార్యక్రమం



**వరంగల్, మే 26 తరంగాలు :**
మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన గోడ పత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఆవిష్కరించారు. సీపీ కార్యాలయంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని సీపీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని సీపీ అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్టపరమైన హక్కులు, రక్షణ చర్యలపై విస్తృతంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోడ పత్రిక ద్వారా మహిళలకు ఉపయోగకరమైన సమాచారం చేరుతుందని పేర్కొన్నారు. పోలీసు శాఖ మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు, హెల్ప్‌లైన్ సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. మహిళలు, బాలికలు నిర్భయంగా జీవించే వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ దార కవిత, అదనపు డీసీపీ రవి, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళల రక్షణకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తరించాలని అధికారులు నిర్ణయించారు.

## జూన్ 3న నకెరికల్‌లో టీయూడబ్ల్యూజే మహాసభ

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి



**నల్గొండ అర్బ్స్,మే 26, తరంగాలు :**
జూన్ 3 వ తేదీన నకెరికల్ నియోజకవర్గ కేంద్రంలో టి యు డబ్ల్యూ జే ( ఐజేయు ) జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నల్లగొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం గారు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి గారు , టి యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ గారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామ నారాయణ గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ. ప్రభాకర్ రెడ్డి గారు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కు ప్రింట్,ఎలక్ట్రాన్ మీడియా, చిన్న పత్రికలు, ఫోటో జర్నలిస్టులు,వీడియో జర్నలిస్టుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికిని సంఘం బాధ్యులంతా సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 27న సాయంత్రంతో సభ్యత్వ నమోదు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇంకా సభ్యత్వ నమోదు పొందని వారు ఎవరైనా ఉంటే స్థానిక మండల నియోజకవర్గ జిల్లా బాధ్యులను సంప్రదించి సభ్యత్వ ము తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు హక్కుల కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులను అందిస్తామని ఇందుకోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

## ఇరాన్ క్షిపణి కేంద్రాలపై అమెరికా దాడులు..

- నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



**మే 26, తరంగాలు :**
దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకులతో సాగి చివరికి నష్టాలతో ముగిశాయి. గడిచిన సెషన్‌లో అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతితో దాదాపు వెయ్యి పాయింట్లకుపైగా లాభపడ్డ మార్కెట్లు.. ఇవాళ ఆ జోరును కొనసాగించలేకపోయాయి. దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలపై అమెరికా దళాలు మళ్లీ దాడులు ప్రారంభించాయన్న వార్తలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలలో మళ్లీ కనిపిస్తున్న కదలికలు మదుపరులలో ఆందోళనలను పెంచాయి. దీనికి తోడు ఇవాళ నెలవారీ డెరివేటివ్స్ ఆప్షన్స్ గడువు ముగిసే రోజు కావడంతో మార్కెట్లలో హెచ్చుతగ్గులు మరింత తీవ్రమయ్యాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు దాదాపు అర శాతం మేర నష్టపోయాయి. అంతకుముందు సెషన్‌తో పోలిస్తే బీఎస్ఈ సెన్సెక్స్ సుమారు 479 పాయింట్లు క్షీణించి 76,009.7 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సైతం కీలకమైన 24,000 మార్కును కోల్పోయి దాదాపు 118 పాయింట్ల నష్టంతో 23,913.7 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్‌లు ఉదయం నష్టాలతో ప్రారంభమైనప్పటికీ ఒక దశలో ఐటీ, ఆటో రంగాల మద్దతుతో కోలుకున్నాయి. మధ్యాహ్నం తర్వాత ఫైనాన్స్, రియల్టీ రంగాలలో పెరిగిన లాభాల స్వీకరణ కారణంగా దలాల్ స్ట్రీట్ మళ్లీ రెడ్ జోన్‌లోకి జారుకుంది. ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ కొన్ని దిగ్గజ కంపెనీల షేర్లు కొనుగోళ్ల మద్దతును పొంది లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు నేటి ట్రేడింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, దాదాపు 3.92 శాతం లాభంతో రూ. 2,961.3 వద్ద స్థిరపడింది. ఆటోమొబైల్ రంగానికి చెందిన టాటా మోటార్స్ షేరు కూడా 3.58 శాతం వృద్ధితో రూ. 386.6 వద్ద ముగిసింది. ఐటీ విభాగం నుండి టెక్ మహీంద్రా షేరు 0.96 శాతం లాభపడి రూ. 1,449.3 వద్ద ముగియగా, ఎటర్నల్ లిమిటెడ్ షేరు 0.84 శాతం లాభాన్ని నమోదు చేసింది.

### ఘనంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం

# ఉమ్మడి ఖమ్మం జిల్లా సమావేశం

- ముఖ్య అతిధిగా అధ్యక్షులు, తెలంగాణ విద్యార్థి జెఏసి చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి
- అధిక సంఖ్యలో హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమకారులు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి రడం సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో డాక్టర్. పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించామన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తాం అన్నారు.కాంగ్రేస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడం కోసం కెకె ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించిందన్నారు.ఈ కమిటీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయం చేసేలా మనం అందరం ఒక ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. జూన్ 21వ తేదీన హైదరాబాద్ లో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం భారీ ఎత్తున ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమ కారులందరూ తప్పకుండా స్వచ్ఛందంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేవి.కృష్ణా రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితంగానే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రకటన చేసిందన్నారు.ఆ కృతజ్ఞతతోనే నేడు తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తెలంగాణ లో పట్టం కట్టారన్నారు.ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు పోరాడుదాం అని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తెలంగాణ సీనియర్ ఉద్యమకారులు డోకుపర్తి. సుబ్బారావు, పగడాల నరేందర్, పొనుగోటి సంపత్, నందిగామ రాజ్ కుమార్, లింగనబోయిన సతీష్, చీకటి కార్తీక్, పమ్మి రవి, పాలకుర్తి. కృష్ణ, బత్తిని మధు గౌడ్, భూక్యా నాగేశ్వర రావు,కోడిరెక్క ఉమా శంకర్,బొబ్బిల్ల భరత్ చంద్ర,దరిపల్లి వీర బాబు,చౌహాన్, 1969 ఉద్యమకారులు ఎం డి.ఖాసీం, రమా దేవి,బొడ్డు గ్లోరీ, కొరివి ధన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలి

- వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ



**వర్ధన్నపేట ప్రతినిధి, మే 26,తరంగాలు :**
మహిళలకు రాజకీయ రంగంలో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు మహిళా కాంగ్రెస్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మహిళా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ కి ఉత్తరాలు రాసినట్లు కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ణాటి పార్వతమ్మ, జిల్లా కోఆర్డినేటర్ మమత , వర్ధన్నపేట మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయి తెలిపారు .కాంగ్రెస్ నేషనల్ మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబ, కాంగ్రెస్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశానుసారం వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, వర్ధన్నపేట మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మరుపట్ల అరుణ సాయి ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేట పట్టణ పట్టణ కేంద్రంలోని



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా రిజర్వేషన్" ఆజ్ కరో అభి కరో " తక్షణమే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ణాటి పార్వతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ మహిళా సాధికారతకు చట్టబద్ధ హామీ అవసరమని అన్నారు.మహిళలకు శాసనసభలు, పార్లమెంటులో తగిన స్థానం కల్పించేందుకు బిల్లు అమలు కీలకమని పేర్కొన్నారు.పోస్ట్ కార్డుల ద్వారా ప్రజాభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చేరవేసే ప్రయత్నం చేస్తున్నామని, ప్రధానమంత్రి మోడీకి పోస్టు కార్డుల ద్వారా మహిళల మద్దతు తెలుపుతూ ఉత్తరాలు రాయడం జరిగిందన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైందని, నిర్ణయాత్మక స్థానాల్లో మహిళల సంఖ్య పెరిగితే సమాజ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆలస్యం చేయకుండా అమలు చేయాలని వారు కోరారు.దేశ జనాభాలో సగానికి పైగా మహిళలే ఉన్నప్పటికీ శాసనసభలు, పార్లమెంట్‌లలో వారి ప్రాతినిధ్యం తక్కువగానే ఉందన్నారు.

మహిళా సాధికారతకు నిజమైన అర్థం రావాలంటే రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోస్ట్ కార్డులు, వినతిపత్రాల ద్వారా ప్రధానిని కోరుతూ దేశవ్యాప్తంగా మహిళల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ అమలుతో రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,కౌన్సిలర్లు వర్ధన్నపేట మండల మహిళా నాయకురాలు అరుణ సాయి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత, వరంగల్ ప్రధాన కార్యదర్శి కర్ర మాలతి సువర్ణ, వరంగల్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజర్ సెక్రెటరీ మమత శ్రీనివాస్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామరపు శిరీష,కార్యదర్శి బుర్రి సునీత,రజిత,పొశాల అరుణ, ఉపసర్పంచ్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- మాదకద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో కఠిన చర్యలు అవసరం
- హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్
- డ్రగ్స్ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహణ



**హనుమకొండ ప్రతినిధి , మే 26, తరంగాలు :**
సమాజానికి మహమ్మారిగా మారుతున్న మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో మరింత విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలు ఎలా దెబ్బ తింటాయో వివరించాలని సూచించారు. సమాజంలో మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో "ప్రహరి క్లబ్బులు" ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, పరకాల ఆర్డీవో వెంకన్న, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు డీఎంహెచ్ఓ మదన్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇక ధరల మంటలే..

- పెరుగుతున్న ఇంధన రేట్లే కారణం
- జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5 శాతానికి!
- మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా
- వచ్చే ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ నో వడ్డింపులు?



**న్యూఢిల్లీ, మే 26 :** పెరుగుతున్న ఇంధన ధరలు, బంగారం-వెండిపై అధిక దిగుమతి సుంకాలు.. జూన్‌కల్లా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 5 శాతానికి ఎగదోసే వీలుందని పలువురు ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్ల పెంపు విషయంలో వేచిచూసే ధోరణినే అవలంబించవచ్చని అభిప్రాయ పడుతుండటం గమనార్హం. గత నెల ఏప్రిల్‌లో అటు రిటైల్, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విజృంభించిన నేపథ్యంలో వచ్చే నెల జూన్‌లో జరుగబోయే ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపోరేటును ఆర్బీఐ పెంచే అవకాశాలే ఎక్కువన్న అంచనాలు వినిపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వడ్డీరేట్లను పెంచడానికి ముందు ఇంధన ధరల పెంపు ప్రభావంలో కొంత స్థిరత్వం ఏర్పడేదాకా పెంపు జోలికి సెంట్రల్ బ్యాంక్ వెళ్లకపోవచ్చనే అభిప్రాయాన్ని ఇప్పుడు మెజారిటీ ఆర్థిక నిపుణులు కనబరుస్తున్నారు. దీంతో జూన్ ద్రవ్య సమీక్షలో వడ్డీరేట్ల పెంపు ఉండదని, ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్) ద్రవ్య సమీక్షల్లోనే వడ్డింపులుంటాయన్న అంచనాలు నెలకొన్నాయి.

### 11 రోజుల్లో రూ.8..

ఈ నెల 15 నుంచి 25 మధ్య 11 రోజుల్లో 4సార్లు పెట్రోల్, డీజిల్ రేట్లను చమురు మార్కెటింగ్ సంస్థలు పెంచేశాయి. తెలంగాణలోనే లీటర్ ధర దాదాపు రూ.8 పెరిగింది. సీఎన్‌జీ కూడా రూ.4 ఎగిసింది. దీంతో రవాణా ఖర్చులు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ ప్రభావం అన్ని వస్తూత్పత్తుల ధరలపై పడుతున్నది. అందుకే పండ్లు, కూరగాయల దగ్గర్నుంచి పప్పులు, వంటనూనెలు, ఇతర కిరాణా సరుకులదాకా అన్ని ఆహార పదార్థాల రేట్లు ఎగబాకాయి. ఈ క్రమంలోనే ఈ నెలకుగాను వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4-4.5 శాతానికి, జూన్‌లో 4.5-5 శాతానికి చేరవచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాత్సవ పీటీఐతో అంటున్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు స్టోరేజీ, జనరేటర్ ఆధారిత విద్యుత్తు ఖర్చులనూ ఎగదోస్తున్నదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా, జూన్ 12న మే నెల రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రానున్నాయి. ఏప్రిల్‌లో 3.48 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఇక టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 8.3 శాతంగా ఉన్నది. అయితే ఆర్బీఐ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగానే ద్రవ్య సమీక్షలో నిర్ణయాలు తీసుకుంటుందన్న విషయం విదితమే.

### ప్రభావం ముున్ముందే..

పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం.. మార్కెట్‌పై పూర్తిగా జూన్ లేదా జూలై నుంచి కనిపిస్తుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పాత స్టాక్ ఉంటుంది కాబట్టి వాటి ధరల్లో మార్పు కనిపించట్లేదని, కొత్త స్టాక్ వస్తే పెరిగిన రవాణా ఖర్చులు, ఇతర ఉత్పాదక వ్యయాన్ని జోడించి నూతన ధరల ముద్రణ ఉంటుందని వివరిస్తున్నారు. ము ఖ్యంగా వంటనూనెలు, ఇతర ఆయిల్స్, సబ్బుల ధరలు పెరిగే వీలుందని చెప్తున్నారు. అంతేగాక వివిధ ఆహార పదార్థాల ధరలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ రేట్లు పెరుగుతాయని పేర్కొంటున్నారు. నిజానికి ఏప్రిల్‌లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష సమయంలో బ్యారెల్ ముడి చమురు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 85 డాలర్లుగా ఉన్నది. ఇప్పుడు అది 10-15 డాలర్లు ఎక్కువగా కదలాడుతున్నది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు ముదిరితే అటు గ్లోబల్ మార్కెట్‌లో, ఇటు దేశీయ మార్కెట్‌లో క్రూడాయిల్, ఇంధన రేట్లు భగ్గుమనడం ఖాయం. దీంతో జూన్ మొదటి వారంలో నమోదయ్యే ముడి చమురు ధరలూ కీలకమేనన్న అభిప్రాయాలున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ఈ ఏడాది ఫిబ్రవరి 28న మొదలవగా.. 3 నెలలు కావస్తున్నా ఆ ఉద్రిక్తతలు సద్దుమణగడం లేదు. అమెరికాకు అండగా ఉంటున్నాయని యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, సౌదీ తదితర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దీంతో చమురు, సహజ వాయువు ఉత్పత్తి పడిపోయింది. పైగా హెర్ముజ్ జలసంధిలో రవాణాను కూడా ఇరాన్ అడ్డుకుంటున్నది. ఫలితంగా భారత్‌కు క్రూడ్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇంధన ధరల పెంపు ప్రభావాన్ని ఆర్బీఐ కనీసం మూడు నెలలపాటైనా పరిశీలించవచ్చు. అప్పటిదాకా వడ్డీరేట్ల పెంపు ఉండదనే అనుకోవచ్చు. అయితే ఒకవేళ రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు 5 శాతాన్ని దాటి నమోదైతే మాత్రం వడ్డీరేట్ల పెంపునకు సెంట్రల్ బ్యాంక్ ఉపక్రమిస్తుంది.

**డీకే శ్రీవాత్సవ, ఈవై ఇండియా చీఫ్ పాలసీ సలహాదారు**

జూన్ నెలలో సీపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం 4 శాతాన్ని దాటి నమోదు కావచ్చు. అయితే ద్రవ్యోల్బణానికి సంబంధించి ఆర్బీఐ పెట్టుకున్న గరిష్ఠ పరిమితి 6 శాతంలోపే ఇది ఉంటుంది కాబట్టి జూన్ 5న జరిగే ద్రవ్య సమీక్షలో వడ్డీరేట్లను సెంట్రల్ బ్యాంక్ యథాతథంగానే ఉంచే అవకాశాలున్నాయి.

**మేఘా అరోరా, ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్**

2026-27లో దేశంలో ద్రవ్యోల్బణ సగటు 5.1 శాతంగా నమోదయ్యే వీలున్నది. ఇక జూన్ ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచుతుందా? తగ్గిస్తుందా? అన్నదానిపై మేము అంచనా వేయలేము. అయితే జూలై-మార్చిలో వడ్డీరేట్ల పెంపులు మాత్రం తప్పవు.

**క్రిసిల్, ఇక్రా ఆర్థికవేత్తలు**

జూన్ ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్ల జోలికి వెళ్లకపోవచ్చని మేము విశ్వసిస్తున్నాం. ఇంధన ధరల ప్రభావం రవాణాపై, ముడి సరుకులపై, అన్ని రకాల ఉత్పత్తులపై మార్కెట్‌లో పూర్తిగా కనిపించేది అక్టోబర్-మార్చిలోనే. అప్పటిదాకా కొత్త స్టాక్ రాదుమరి. కాబట్టి అప్పుడు ద్రవ్యోల్బణం గణాంకాలు ఎక్కువగా నమోదయ్యే వీలున్నది.

**ఆస్తా గుడ్వానీ, బార్క్‌లేస్ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త**

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని భరోసా

**జనగామ, మే 26 తరంగాలు :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఘనపూర్ (స్టేషన్) పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, నమిలిగొండ ఐకేపీ కేంద్రం, జఫర్గఢ్ మండలంలోని కూనూరు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎన్ని టోకెన్లు జారీ చేశారో, ఇప్పటివరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యం తరలించాయో కలెక్టర్ ఆరా తీశారు. ఏ మిల్లుకు ఎంత ధాన్యం పంపించారో, ట్రక్ షీట్లలో వివరాలు సక్రమంగా నమోదు చేశారా అనే అంశాలను పరిశీలించారు. ఓపీఎంఎస్ నమోదులు, రిజిస్టర్ల నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు. టోకెన్ జారీ నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. టోకెన్ వారీగా రైతుల వివరాలు, వాహనాల సంఖ్య, తరలింపు సమయాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వేగంగా తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల సంఖ్య పెంచి లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని సూచించారు. గన్ని సంచుల లభ్యత, కాంటా ప్రక్రియ, తేమ శాతం నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ధాన్యం తేమ శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంటా వద్ద 41 కిలోల ప్రకారం తూకం వేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. కూనూరు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం రవాణా పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, వెంటనే రెండు లారీలను పంపించాలని ఆర్టీఓ అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణా ఆలస్యం కాకుండా డీసీఎంలు, లారీలను సమకూర్చాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతమైన చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు.





# బక్రీద్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు

- విజుబుల్ పోలీసింగ్‌పై సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలు
- చెక్‌పోస్టులు, సోషల్ మీడియాలో ప్రత్యేక నిఘా
- ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహణపై దృష్టి

**వరంగల్, మే 26 తరంగాలు :** బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థనా స్థలాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు విజుబుల్ పోలీసింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లపై కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వరంగల్ కమిషనరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గోవుల పరిరక్షణ విషయంలో చెక్‌పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు చెక్‌పోస్టుల ద్వారా 11 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పండుగ నేపథ్యంలో అన్ని స్టేషన్ పరిధిలో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే సంతలు, పశువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. గతంలో మత ఘర్షణల్లో పాల్గొన్న వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని, అవసరమైన వారిని బైండోవర్ చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన నిఘా పెట్టాలని కమిషనర్ ఆదేశించారు. అసత్య ప్రచారం చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పండుగ రోజున పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండి ప్రజలకు భద్రత కల్పించాలని సూచించారు. వధశాలల వద్ద పరిశుభ్రత పాటించేలా చూడాలని, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్థానిక మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు.







# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ ప్రతినిధి, 26 మే, తరంగాలు :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్యతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.







THARANGALU DAILY NEWS
బుధవారం, 27 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

**ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి**

వాషింగ్టన్,మే26 అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.


## మహాసిమెంట్ కార్మికుల ఆందోళన

**జీతాలు పెంచాలంటూ కర్మాగారం ముందు ధర్నా**

అనకాపల్లి,మే26 ఎన్నాళ్లు చేసిన అదే కూలి ? అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా ? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంవత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్ధతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.

## ఎండల తీవ్రత మరింత పెరుగుదల

**రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు**




హైదరాబాద్,మే26: ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

### ఓటర్ల జాబితానే ఎన్నికల్లో

# గెలుపుకు తొలి అడుగు

- ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా బాధ్యత
- ప్రతి బీఎల్‌ఏ ఒక సైనికుడిలా పని చేయాలి
- రాష్ట్రంలో ఓట్ల తొలగింపుల పరిస్థితి రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలతో కలిసి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలి
- కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై ప్రత్యేక నిఘా అవసరం
- కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య






**హన్మకొండ ప్రతినిధి, మే 26,తరంగాలు :** ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని,ప్రతి బీఎల్‌ఏ ఒక సైనికుడిలా పని చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన భూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సులో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య రూపొందించిన "భూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్" ను ఆవిష్కరించి, బీ ఎల్ ఏ లకు, డివిజన్ ఇంచార్జ్‌లకు అందజేశారు.అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకుంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో బీ ఎల్ ఏ లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మార్పులను గమనించాలని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి బీ ఎల్ ఏ వద్ద తాజా ఓటర్ల జాబితా ఉండాలని, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, అనుమానాస్పద ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బీ ఎల్ ఏ లు, బీ ఎల్ ఓ లతో కలిసి వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని పేర్కొన్నారు. "మన ఓటును మనమే కాపాడుకోవాలని, ప్రతి బీ ఎల్ ఓ ఒక సైనికుడిలా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి" అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీ ఎల్ ఓ లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎం ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.



# నేటినుంచి టిడిపి మహానాడు

**వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ**

**పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు**




అమరావతి,మే26 టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

- అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్,మే26 ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ÷ుదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

## అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

- అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి
- సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

హైదరాబాద్,మే26 భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# ఐపీఎల్ 2016 మ్యాజిక్ రిపీట్ అవుతుందా?

ఐపీఎల్ 2026 లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిసి ప్లేఆఫ్స్ సమరానికి తెరలేవడంతో క్రికెట్ లవర్స్ ఫైనల్ పోరు కోసం మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంలో ప్రతి ఒక్కరికీ పదేళ్ల కిందట ఆరెంజ్ ఆర్మీ సృష్టించిన ఒక అద్భుతమైన రికార్డు గుర్తుకు వస్తోంది. ఐపీఎల్ చరిత్రలో ఎలిమినేటర్ నుంచి వచ్చి కప్ కొట్టిన ఏకైక జట్టుగా హైదరాబాద్‌కు ఒక ప్రత్యేకమైన రికార్డు ఉంది. అయితే ఆ సీజన్‌లో హైదరాబాద్ ఎవరితో గెలిచింది, అసలు ఆ ప్లేఆఫ్స్ లెక్కలు ఏంటి, ఎవరెవరిని ఓడించుకుంటూ వచ్చి ఛాంపియన్‌గా నిలిచింది . ఐపీఎల్ 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన అద్భుత కెప్టెన్సీతో ముందుండి నడిపించాడు. కేవలం కెప్టెన్‌గానే కాకుండా ఆ సీజన్‌లో బ్యాట్‌తోనూ రికార్డు స్థాయి పరుగులతో వార్నర్ చెలరేగిపోయాడు. ఆ ఏడాది లీగ్ దశ ముగిసేసరికి హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫైనల్‌కు వెళ్లడానికి కేవలం ఒకే ఒక్క అవకాశం ఉండే అత్యంత కష్టమైన ఎలిమినేటర్ దారిలో సన్‌రైజర్స్ ప్రయాణం మొదలైంది. 2016 ప్లేఆఫ్స్‌లో భాగంగా హైదరాబాద్ జట్టు తన మొదటి మ్యాచ్‌ను దిల్లీ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఈ చావో రేవో ఎలిమినేటర్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. యువరాజ్ సింగ్ వేగంగా 44 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. ఆ తర్వాత లక్ష్య ఛేధనలో కోల్‌కతాను భువనేశ్వర్ కుమార్, హెన్రిక్స్‌ల బౌలింగ్‌తో కట్టడి చేసిన హైదరాబాద్ జట్టు, కేకేఆర్‌ను 140 పరుగులకే పరిమితం చేసింది. 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి క్వాలిఫైయర్-2లోకి అడుగు పెట్టింది.కోల్‌కతాను ఓడించిన



జోష్‌లో ఉన్న హైదరాబాద్‌కు క్వాలిఫైయర్-2లో సురేష్ రైనా నేతృత్వంలోని గుజరాత్ లయన్స్ జట్టు ఎదురైంది. దిల్లీలోనే జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ లయన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఆ తర్వాత 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఒక దశలో 117 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి తీవ్రమైన ఒత్తిడిలో పడింది. కానీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఒంటి పోరాటం చేస్తూ 58 బంతుల్లోనే 93 పరుగులు చేసి, మరో 4 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించి ఫైనల్ బెర్త్ ఖరారు చేశాడు.ఇక 2016 మే 29న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. విరాట్ కోహ్లీ భీకరమైన ఫామ్‌లో ఉన్న ఆర్సీబీని వారి సొంత మైదానంలో ఢీకొట్టడం అంటే అప్పట్లో మామూలు విషయం కాదు. ఈ హైవోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్, బెన్ కటింగ్‌ల మెరుపులతో ఏకంగా 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్కంఠ పోరులో చివరకు భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీని కట్టడి చేసి 8 పరుగుల తేడాతో చరిత్రాత్మక విజయాన్ని, మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందించాడు.అయితే పదేళ్ల తరువాత మళ్ళీ హైదరాబాద్ జట్టు అలాంటి పరిస్థితుల్లోనే ఫైనల్ సమరానికి సిద్ధమవ్వడం విశేషం. ఈ ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడానికి సరికొత్త ఫైట్స్ రెడీగా ఉన్నాయి. ఆరెంజ్ ఆర్మీ తన మొదటి ఎలిమినేటర్ ఫైట్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడాల్సి ఉంటుంది. లీగ్ స్టేజ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు భీకరమైన ఫామ్‌లో ఉన్నందున ఈ మ్యాచ్‌లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ ఈ మొదటి ఫైట్‌లో రాజస్థాన్‌పై గెలిస్తే, ఆ తర్వాత జరిగే క్వాలిఫైయర్ 2లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లేదా గుజరాత్ టైటాన్స్ జట్లలో ఒకరితో హైదరాబాద్ పోరాడాల్సి ఉంటుంది. క్వాలిఫైయర్-1లో ఓడిపోయిన జట్టు ఇక్కడికి వస్తుంది కాబట్టి ఆ ఫైట్ ఎంతో ఆసక్తికరంగా మారనుంది.క్వాలిఫైయర్-2లో కూడా గెలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా ఫైనల్‌లో అడుగు పెడుతుంది. అక్కడ టైటిల్ పోరులో మళ్లీ క్వాలిఫైయర్-1లో గెలిచి ఆల్రెడీ ఫైనల్‌లో వెయిట్ చేస్తున్న ఆర్సీబీ లేదా గుజరాత్‌తోనే హైదరాబాద్ ఫైనల్ ఫైట్ చేయాల్సి ఉంటుంది. అంటే ఈసారి కూడా కప్ కొట్టాలి అంటే హైదరాబాద్ బ్యాక్ టు బ్యాక్ మూడు భారీ మ్యాచ్‌లలో గెలవాల్సిందే. ఆనాడు డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా ప్లేయర్‌గా జట్టును ఛాంపియన్‌గా నిలబెడితే, ఇప్పుడు మరో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆరెంజ్ ఆర్మీని నడిపిస్తున్నాడు. మరి హార్డ్ మ్యాచుల్లో అన్నింటిలోనూ గెలిచి ఆనాటి 2016 మ్యాజిక్‌ను కమిన్స్ సేన రిపీట్ చేస్తుందో లేదో చూడాలి మరి.

# క్వాలిఫయర్ 1లో చిత్తైన గుజరాత్.. ఫైనల్లో ఆర్సీబీ..

రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్ 1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్సీబీ.. జాకబ్ డఫ్ఫీ(39-3), రసిక్ దార్ సలాం(24-2), భువనేశ్వర్(28-4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది.

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. 19వ సీజన్ క్వాలిఫయర్ 1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్సీబీ.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్ఫీ (39-3) రసిక్ దార్(24-2), హేజిల్‌వుడ్(39-1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది.



ఆర్సీబీ నిలిపిన 255 పరుగుల లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన గుజరాత్ ఛేదనలో ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సుదర్శన్(14) బ్యాట్‌ను వికెట్లపై పడేసుకొని హిట్‌వికెట్‌గా వెనుదిరగగా.. భువనేశ్వర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(2)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. అనంతరం హేజిల్‌వుడ్ ఓవర్లో 4, 6, 4 బాదిన బట్లర్(29) బౌల్డయ్యాడు. రసిక్ దార్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిషాంత్ సింధు(5).. తర్వాతి బంతికే హేజిల్‌వుడ్ చేతికి చిక్కి హోల్డర్(0) చిక్కగా 51కే సగం వికెట్లు కోల్పోయింది గుజరాత్.అప్పటికే ఓటమి ఖరారవ్వగా సుందర్ తేలిపోయాడు. సహకరించేవాళ్లు లేక ఒంటరైన ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా (68) పరుగుల అంతరం తగ్గించే ప్రయత్నం చేశాడు. అర్ధ శతకంతో విసిగించిన తెవాటియా 19వ ఓవర్లో పటిదార్ క్యాచ్‌తో డగౌట్ చేరాడు. సిరాజ్ చివరి వికెట్‌గా ఔటవ్వగా ఆర్సీబీ 92 పరుగులతో విజయం సాధించింది.

### గిల్ బౌల్డ్





### చితక్కొట్టిన పటిదార్

క్వాలిఫయర్ 1లో కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు స్కోర్ కొట్టింది. విరాట్ కోహ్లీ(43), పడిక్కల్(30)లు అదిరే ఆరంభమివ్వగా.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆర్సీబీ 76 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) మెరుపుఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లను భయపెట్టాడు. ఖేజ్రోలియా వేసిన 15వ ఓవర్లో రెండు నో బాల్స్, వైడ్, నాలుగు ఫోర్లు, సిక్సర్ కలిపి 28 రన్స్ వచ్చాయి.

కృనాల్(43), రజత్ పటిదార్(93 నాటౌట్)

మూడో వికెట్‌కు 95 రన్స్ జోడించిన కృనాల్(43)ను రబడ ఔట్ చేయగా గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. కానీ, పటిదార్ రెండు సిక్సర్లతో స్కోర్ రెండొందలు దాటించాడు. అంతేనా.. ప్రసిధ్ వేసిన చివరి ఓవర్లో రెండు సిక్సర్లు బాదేశాడు. గుజరాత్ చెత్త ఫీల్డింగ్ కూడా కలిసి రావడంతో ఆర్సీబీ నాకౌట్‌లో అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించింది. 2023లో ముంబై ఇండియన్స్‌పై 233/3తో గుజరాత్ సాధించిన రికార్డును బెంగళూరు బద్ధలు కొట్టింది.



# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల


నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

## కోహ్లీ సరికొత్త రికార్డు..



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో అద్భుతమైన మైలురాయి చేరింది. ఐపీఎల్ ప్రారంభమైన 2008 సీజన్ నుంచి ఆర్‌సీబీ జట్టుకు నమ్మకమైన పిల్లర్‌గా నిలిచిన కోహ్లీ, ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మే 26న ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో బరిలోకి దిగడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజాల సరసన కోహ్లీ చోటు సంపాదించుకున్నాడు.ఐపీఎల్ చరిత్రను తిరగేస్తే విరాట్ కోహ్లీ పేరిట లేని రికార్డు అంటూ లేదు. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను మొత్తం 9218 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు (76 హాఫ్ సెంచరీలు) చేసిన రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. అతని తర్వాత డేవిడ్ వార్నర్ ఉండగా, ప్రస్తుతం ఆడుతున్న యాక్టివ్ ప్లేయర్లలో కేఎల్ రాహుల్ 51 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ గణాంకాలే ఐపీఎల్‌లో కోహ్లీ సృష్టించిన సామ్రాజ్యానికి అద్దం పడుతున్నాయి. తాజాగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌తో కలిపి విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 18వ ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ ఆడుతున్నాడు. దీనితో అతను శిఖర్ ధావన్, దినేష్ కార్తీక్, కీరన్ పొలార్డ్ వంటి దిగ్గజాల రికార్డును సమం చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 28 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (24 మ్యాచ్‌లు), సురేష్ రైనా (24 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ (23 మ్యాచ్‌లు), అంబటి రాయుడు (23 మ్యాచ్‌లు), రవీంద్ర జడేజా (23 మ్యాచ్‌లు), డ్వేన్ బ్రావో (19 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇప్పుడు వారి వెనుకే విరాట్ కోహ్లీ కూడా చేరిపోయాడు. ఐపీఎల్ నాకౌట్ స్టేజ్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనపై భిన్నమైన రికార్డులు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున అతను ఇప్పటివరకు 4 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఫైనల్స్ లో కోహ్లీ 34.75 సగటుతో, 126.36 స్ట్రైక్ రేట్‌తో పర్వాలేదనిపించేలా రాణించాడు. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌ల విషయానికి వస్తే మాత్రం కోహ్లీ ట్రాక్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఆడిన 5 ఎలిమినేటర్ మ్యాచ్‌లలో అతను కేవలం 23.00 సగటు, 108.49 పేలవమైన స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేశాడు. ఈ స్లో బ్యాటింగ్ కారణంగా గతంలో ఆర్‌సీబీ కొన్ని కీలక మ్యాచ్‌లలో ఓటమి పాలుకావాల్సి వచ్చింది. పాత రికార్డులు ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో మాత్రం విరాట్ కోహ్లీ వీరవిహారం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచ్‌లలో అతను 50కి పైగా అద్భుతమైన సగటుతో, 162.03 స్కై-హై స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. ఆర్‌సీబీ జట్టు వరుస విజయాలతో ప్లేఆఫ్స్ క్వాలిఫైయర్ 1 కి చేరుకోవడంలో కోహ్లీ బ్యాటింగే ప్రధాన బలమైంది. ఇదే ఫామ్‌ను గుజరాత్‌పై కూడా కొనసాగించి, ఆర్‌సీబీని ఫైనల్‌కు చేర్చడమే లక్ష్యంగా కింగ్ కోహ్లీ బరిలోకి దిగాడు.

## రియాన్ పరాగ్, వైభవ్ సూర్యవంశీ మధ్య కోల్డ్ వార్..?



ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ ఉత్కంఠ రేపుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేగింది. మైదానంలో పరుగుల వరద పారిస్తున్న సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. ముంబై విమానాశ్రయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర ఘటనే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తర్వాత ఈ ఏడాది ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే ఎలిమి నేటర్ మ్యాచ్ కోసం జట్టు ముంబై నుంచి చండీగఢ్‌కు విమానంలో ప్రయాణమైంది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించిన ఉత్సాహంలో ఉన్న రాయల్స్ ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆటగాళ్ల ఫోటోలను తీసేందుకు మీడియా ప్రతి నిధులు, ఫోటోగ్రాఫర్లు ఎగబడ్డారు. ఈ క్రమంలో ఒక ఫోటోగ్రాఫర్ కెప్టెన్ రియాన్ పరాగ్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలను కలిసి ఒక ఫోటో ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి పరాగ్ తనదైన శైలిలో స్పందిస్తూ, "మేమేమీ సినిమా స్టార్లం కాదు" అంటూ ఫోటో ఇవ్వడానికి నిరాకరించాడు. పరాగ్ చేసిన ఈ వ్యాఖ్య పక్కనే ఉన్న 15 ఏళ్ల వైభవ్‌కు నచ్చలేదు. దాంతో ఆయన తన కెప్టెన్‌ను ఎంతో సీరియస్‌గా, కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఈ చూపుల యుద్ధానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తోందనే ప్రచారం ఊపందుకుంది. ఈ సీజన్లో రాజస్థాన్ రాయల్స్ జట్టును వైభవ్ సూర్యవంశీ ఒంటిచేత్తో ముందుకు నడిపిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జస్ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను నెట్ బౌలర్లకంటే హీనంగా బాదేస్తున్నాడు.